
సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

శుక్రవారం । 26 । మే । 2023



వడిబడిగా మెరుగులు

విద్యార్థుల ఉన్నత భవిష్యత్తే లక్ష్యంగా సీఎం జగన్ కోట్లాది రూపాయలతో పాఠశాలల రూపురేఖలను మార్చారు. కార్పొరేట్ పాఠశాలలకు ఏ మాత్రం తీసిపోని విధంగా తీర్చిదిద్దారు. -8లో



మిగులు జలాల విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గురువారం 7,992 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజీ వద్ద 10.45అడుగులకు నీటి మట్టం చేరింది.

గరిష్ఠం/కనిష్ఠం
43.0°/27.9°

	గరిష్ఠం	కనిష్ఠం
రాజమహేంద్రవరం	43.0	29.0
కాకినాడ	40.3	27.9
అమలాపురం	39.9	28.0

నేను విన్నాను.. నేను ఉన్నాను

- ప్రజల వినతులకు స్పందించిన సీఎం వైఎస్ జగన్
- సీఎం ఆదేశాలతో కదిలిన అధికార యంత్రాంగం
- గంటల వ్యవధిలోనే ఆర్థిక సాయం అందజేత

మనసున్న మారాజుగా జగన్‌మోహన్‌రెడ్డిని వారు కీర్తిస్తున్నారు. సమస్య విన్నవించిన గంటల వ్యవధిలోనే స్పందించిన ముఖ్యమంత్రిని దేవుడని కొనియాడుతున్నారు. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరులో బుధవారం జగనన్న విద్యాదీవెన కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించిన సంగతి తెలిసిందే . ఈ సందర్భంగా తమ ప్రియతమ నేతను కలసి కష్టాలను చెప్పుకోవాలని పలువురు అక్కడికి వచ్చారు. వారిని చూసి జగన్‌మోహన్‌రెడ్డి చలించిపోయారు. వారి సమస్యలను సావధానంగా విన్నారు. అభ్యర్థనలను స్వీకరించారు. ఇందులో కొందరు అనారోగ్య బాధితులు కూడా ఉన్నారు. వీరి వినతులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా అధికార యంత్రాంగం ఆగమేఘాలపై కదిలింది. వడివడిగా వారి వేదనలకు పరిష్కారం చూపింది. అర్జీ అందించిన మర్నాడే బాధితులను కలెక్టర్ మాధవీలత పిలిపించి మరీ సాయమందించారు. హోం మంత్రి తానేటి వనిత.. ఎమ్మెల్యే తలారి వెంకట్రావుతో కలసి గురువారం 13 మంది బాధితులకు రూ.21 లక్షల మేర ఆర్థిక సాయం అందించారు. దీంతో బాధిత కుటుంబ సభ్యులంతా ఆనందభరితులయ్యారు. సీఎంకు రుణపడి ఉంటామని ధన్యవాదాలు తెలియజేశారు.

– కొవ్వూరు




❖ చాగల్లు మండలం మార్కొండపాడుకి చెందిన ఉర్ల రాజేష్ తన ఆరేళ్ల కుమార్తె నితీషాను సీఎంకు చూపించారు. ఆమెకు మెదడు ఎదుగుదల లేదని, చికిత్స చేయించడానికి సాయపడాలని వేడుకున్నాడు. సీఎం స్పందించి చిన్నారి వైద్యానికి తక్షణ సాయంగా రూ.5లక్షలు మంజూరు చేశారు. ప్రభుత్వ పరంగా వైద్య చికిత్సకు హామీ ఇచ్చారు. ఈ చెక్కును గురువారం కలెక్టర్ బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.




❖ లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్‌కోసం రూ.10 లక్షలు సీఎం రిలీఫ్ ఫండ్ ఇచ్చారు. చికిత్స కోసం మరిన్ని నిధుల అవసరం ఉంది. ఆర్థిక ఇబ్బందుల కారణంగా వైద్య సేవలు పొందలేకపోతున్నానని పెరవలికి చెందిన కంకిపాటి సుధాకర్ సీఎంను వేడుకున్నారు. వెంటనే సీఎం చలించిపోయారు. ఆయన ఆదేశాల మేరకు అధికారులు రూ.లక్ష చెక్‌ను గురువారం అందజేశారు. మిగిలిన సొమ్మును సీఎంఆర్‌ఎఫ్ ద్వారా అందజేయడానికి చర్యలు తీసుకున్నారు.




❖ గాదరాడకి చెందిన కె.బుజ్జమ్మ కుమార్తె రెజీనా ఇవాం జిల్లెన్‌కు ఎనిమిదేళ్లు. ఈమెకు అవయవాలు దెబ్బతిన్నాయి. చికిత్స కోసం రూ.35లక్షల వరకు ఖర్చు చేసినట్లు సీఎంను కలిసి తల్లిదండ్రులు తెలియజేశారు. తదుపరి వైద్య సేవల కోసం సహకరించాలని కోరారు. తక్షణ వైద్య సాయం కోసం రూ.లక్ష మంజూరు చేశారు. సీఎంఆర్‌ఎఫ్ కింద రూ.20 లక్షల కోసం సీఎం సిఫారసు చేశారు.




❖ కొవ్వూరు పట్టణానికి చెందిన ఎస్.దివ్యకుమారి కుమారుడు రియాన్ బ్రెయిన్ క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. సీఎం జగన్‌ను కలిసి తమ బిడ్డ వైద్యానికి ఆర్థిక సాయం కావాలని తల్లి కోరింది. డాక్టర్ వైఎస్సార్ నవ శకం ఆరోగ్య పింఛన్‌గా రూ.10 వేలు సీఎం మంజూరు చేశారు. రూ.లక్ష సాయం కూడా ప్రకటించారు. ఈ చెక్కును గురువారం హోం మంత్రి సమక్షంలో కలెక్టర్ అందజేశారు.




❖ తన కుమారుడు సాకేత్‌కు సుమారు 11 నెలలు వయస్సులో మెదడులో రక్తం గడ్డం కట్టడం వలన శరీర భాగాలు పనిచేయడం లేదని ఆదుకోవాలంటూ కొవ్వూరు పట్టణానికి చెందిన కె.విజయలక్ష్మి సీఎంకు విన్నవించుకున్నారు. బాబుకు తక్షణ వైద్యం కోసం ఆయన రూ.లక్ష సాయం మంజూరు చేశారు. గురువారం ఆ సాయాన్ని అధికారులు అందజేశారు.




❖ చాగల్లుకు చెందిన సనమండ్ర వెంకటేశ్వర్లు దివ్యాంగుడు. జీవనోపాధి కోసం వ్యాపారం చేసుకోవడానికి సాయపడాలని ముఖ్యమంత్రిని కలిసి విన్నవించుకున్నాడు. భార్య దివ్యాంగుల పింఛన్ పొందుతున్నట్లు చెప్పాడు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.లక్ష మంజూరు చేశారు. డెయిరీ ఏర్పాటు చేసుకోవడానికి మునిసిపల్ కాంప్లెక్స్‌లో షాపు కేటాయిస్తూ ఉత్తర్వులిచ్చారు.




❖ నల్లజర్లకి చెందిన సాయి పవన్‌కు బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్..కీమో థెరపీ చికిత్స చేయాల్సి ఉంది. తక్షణ వైద్య సేవలకు సాయం చేసి ఆదుకోవాలని బాలుడి తల్లిదండ్రులు సీఎంను వేడుకున్నారు. దీంతో వెంటనే వైద్య ఖర్చులకు రూ.లక్ష మంజూరు చేశారు. పూర్తి స్థాయి వైద్య సేవలకు సిఫార్సు చేయనున్నట్లు ప్రకటించారు. చెక్కును హోంమంత్రి గురువారం అందజేశారు.




❖ తన కుమార్తె చిన్నతనం నుంచి బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతోందని ..బోన్ మ్యారో చికిత్సకు సహకరించాలని నల్లజర్లకు చెందిన కొమరవపు శ్రీను సీఎంను కలసి విన్నవించుకున్నాడు. సీఎం ఆదేశాల మేరకు తక్షణ సాయంగా శ్రీను కుటుంబానికి రూ.లక్ష చెక్కుని గురువారం అందజేశారు. సీఎంఆర్‌ఎఫ్ ద్వారా వైద్య సేవలు అందించేందుకు సిఫారసు చేశారు.




❖ కిడ్నీ చికిత్సకు రూ.15 లక్షలు ఖర్చు అవుతుండగా ఆరోగ్యశ్రీలో రూ.1.65 లక్షలు మాత్రమే ఇచ్చారని ఉండ్రాజవరం మండలం వెలగదుర్రు గ్రామానికి చెందిన వెలిగట్ల గోవిందరావు సీఎంకు విన్నవించుకున్నాడు. మిగిలిన ఆర్థిక సహాయం చేయాలని కోరాడు. సీఎం ఆదేశాల మేరకు అధికారులు చర్యలు తీసుకున్నారు. తక్షణసాయంగా రూ.లక్ష చెక్‌ను గురువారం హోంమంత్రి వనిత అందజేశారు. సీఎంఆర్‌ఎఫ్‌కు సిఫారసు చేశారు.

❖ చాగల్లుకు చెందిన మీసాల అపర్ణ కుమార్తెకు 13 ఏళ్లు. తీవ్ర రక్తహీనతతో బాధపడుతోంది. హీనోగ్లేజిక్ టెలెంగీర్సియాతో బాధపడుతోంది. ప్రతీ నెల రక్తం మార్పిడి చేయాల్సి వస్తుంది. అపర్ణ ముఖ్యమంత్రిని కలిసి కష్టం చెప్పుకోగానే ఆయన స్పందించారు. తక్షణ వైద్య సేవల నిమిత్తం రూ.లక్ష మంజూరు చేశారు. ఈ ఆర్థిక సాయాన్ని గురువారం కలెక్టర్ అందజేశారు.

❖ క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న తనకు చికిత్స కోసం సహాయ పడాలని రాజమహేంద్రవరం లాలాచెరువు ప్రాంతానికి చెందిన పితాని సత్యనారాయణ బుధవారం సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి కోరారు. దీంతో ఆతనికి తక్షణ వైద్య సాయం కింద రూ.లక్ష మంజూరు చేశారు. ఈ చెక్కును అధికారులు కొద్ది గంటల్లోనే అందజేశారు. పింఛన్ పునరుద్ధరణకు ఉత్తర్వులు జారీ చేశారు.

❖ చాగల్లు మండలం చిక్కాల గ్రామానికి ఇళ్ల లక్ష్మణరావు కుమారుడు మంగరావు 2019లో ప్రమాదం బారిన పడ్డాడు. తలకు బలమైన గాయమైంది. మెదడులో రక్తం గడ్డ కట్టడం వలన మాట్లాడలేకపోతున్నాడు. చికిత్స కోసం సహకరించాలని సీఎంను కోరారు. ఇతనికి తక్షణం రూ.5వేలు పింఛన్ మంజూరు చేశారు. గురువారం రూ.లక్ష వైద్య సాయంగా అందించారు.

న్యూస్‌రీల్

ఏఎస్పీగా ఖాదర్ బాషా బాధ్యతల స్వీకరణ



ఎస్పీ శ్రీధర్‌ను కలిసిన ఏఎస్పీ ఖాదర్ బాషా

అమలాపురం టౌన్: జిల్లా ఏఎస్పీగా ఎస్.ఖాదర్ బాషా స్థానిక ఎస్పీ కార్యాలయంలోని తన చాంబర్‌లో గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎస్పీ సుసరాపు శ్రీధర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. డీఎస్పీ నుంచి పదోన్నతి పొందిన ఖాదర్ బాషా ఏఎస్పీగా ఇక్కడ నియమితులయ్యారు. డీఎస్పీగా వెయిటింగ్‌లో ఉన్న బాషా మంగళగిరి పోలీసు హెడ్ క్వార్టర్స్ నుంచి ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకూ జిల్లా ఏఎస్పీగా పనిచేసిన కె.లతామాధరి మంగళగిరి హెడ్ క్వార్టర్స్‌లో రిపోర్టు చేయనున్నారు.

విఘ్నేశ్వరుని ఆదాయం రూ.21.85 లక్షలు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరుని హుండీ ఆదాయాన్ని గురువారం ఆలయ తనిఖీదారు జంపా రామలింగేశ్వరరావు ఆధ్వర్యంలో లెక్కించారు. 57 రోజులకు గాను స్వామివారికి రూ.21,85,031 లభించినట్లు ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. హుండీ లెక్కింపు కార్యక్రమంలో ఆలయ చైర్మన్ నంబూరి వెంకటరమణరాజు, పాలక వర్గ సభ్యులు, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

నేడు చంద్రబాబు రాక

సాక్షి, రాజమహేంద్రవరం: టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు శుక్రవారం జిల్లాకు రానున్నారు. ఉండవల్లి నుంచి బయలుదేరి సాయంత్రం 5 గంటలకు మంజీర హోటల్‌కు చేరుకుంటారు. 7.30 గంటలకు మంజీరా నుంచి బయలు దేరి 8 గంటలకు కడియం మండలం వేమగిరిలోని మహానాడు సభా ప్రాంగణానికి చేరుకుంటారు. రాత్రి అక్కడే బస చేసి శనివారం, ఆదివారం నిర్వహించే మహానాడు కార్యక్రమంలో పాల్గొంటారు.

ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి శత జయంతి ఉత్సవాలా?

ఎంపీ మార్గాని భరత్‌రామ్

రాజమహేంద్రవరం రూరల్: మహానాడు కార్యక్రమం కోసం రాజమహేంద్రవరం వస్తున్న చంద్రబాబు... తొలుత ఆయన సీఎంగా ఉండగా పుష్కరాల సమయంలో తొక్కిసలాట వల్ల మృతిచెందిన 29 మంది కుటుంబాలను, గాయపడిన 50 మందికి పైగా బాధితులను పరామర్శించాలని రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్ డిమాండ్ చేశారు. రాజమహేంద్రవరంలో గురువారం భరత్ రామ్ మీడియాతో మాట్లాడుతూ గోదావరి పుష్కరాల్లో తొక్కిసలాట జరిగి తొమ్మిదేళ్లయినా చంద్రబాబు కనీసం మృతుల కుటుంబాలను పరామర్శించలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. రాజకీయ ప్రచారం కోసం డ్రోన్ కెమెరాలతో షూటింగ్ హడావుడి చేసి... ఒక్కసారిగా గేట్లు తీయడం వల్లే 29 మందిని పొట్టన పెట్టుకున్నారన్నారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి హఠాన్మరణం వార్త విని రాష్ట్రంలో కొన్ని వందల మంది ఆయన అభిమానులు గుండె ఆగి మరణిస్తే... వైఎస్సార్ తనయుడు జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి ఒక్కరి ఇంటికి వెళ్లి కన్నీళ్లు తుడిచారని, ఆ కుటుంబాలకు అండగా నిలిచారని గుర్తుచేశారు.

సమర్థంగా జగనన్నకు చెబుదాం

కలెక్టర్ హిమాన్షు శుక్లా



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ శుక్లా, జేసీ ధ్యానచంద్ర, డీఆర్వో సత్తిబాబు

సాక్షి అమలాపురం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని జిల్లాలో సమర్థంగా నిర్వహించాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. అమరావతి సచివాలయం నుంచి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర్‌రెడ్డి గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ శుక్లా, జేసీ ధ్యానచంద్ర, డీఆర్వో సీహెచ్ సత్తిబాబుతో పాటు జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎస్ జవహర్‌రెడ్డి జగనన్నకు చెబుదాం , మహిళా శిశు సంక్షేమం, పాఠశాల విద్య, నాడు-నేడు, విలేజ్, వార్డ్ సెక్రటేరియట్‌పై సమీక్షించారు. అనంతరం అధికారులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం స్పందన ఫిర్యాదులపై జిల్లాలో చేపడుతున్న విధానాన్ని వివరించారు. జిల్లాలో అంగన్వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ జీవీ సత్యవాణిని ఆదేశించారు. వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలన్నారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు నాడు- నేడు పనులు పూర్తి అయ్యేవిధంగా విద్యాశాఖ అధికారులు పనిచేయాలని కలెక్టర్ శుక్లా తెలిపారు. ఈ సమావేశంలో జీఎస్‌డబ్ల్యూఎస్ నోడల్ అధికారి భీమేశ్వరరావు పాల్గొన్నారు.

పర్యావరణ జీవనశైలికి కట్టుబడి ఉండండి

వనరులను, నీటిని పొదుపుగా వాడడం ద్వారా పర్యావరణ జీవనశైలి సాధించవచ్చునని కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. ప్లాస్టిక్ వినియోగంతో పాటు ఎలక్ట్రానిక వ్యర్థాలను తగ్గించడం, సుస్థిరమైన ఆహార పద్ధతులను అలవర్చుకోవడం, వ్యర్థాలను తగ్గించడం, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవడం చేయాలని ఆయన కోరారు. కలెక్టరేట్‌లో గురువారం అటవీశాఖ ఆధ్వర్యంలో పర్యావరణ జీవనశైలి పెంపొందించే విధంగా ప్రతిజ్ఞ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం సాధ్యమైనవన్నీ మార్పులు చేసుకుంటే మంచి జీవన విధానం గడపవచ్చన్నారు. కుటుంబ సభ్యులు, స్నేహితులు, ఇతరులు పర్యావరణ అనుకూల అలవాట్లు అలవర్చుకుంటే ఆ దిశగా పర్యావరణ హిత జీవనశైలిని సాధించవచ్చునన్నారు. ప్రజల జీవన శైలిలో చిన్న చిన్న మార్పు లను చేయడం ద్వారా పర్యావరణ హిత జీవనశైలి విజేతలు కావచ్చని కలెక్టర్ శుక్లా అన్నారు. కలెక్టర్‌తోపాటు జేసీ ధ్యానచంద్ర, డీఆర్వో సీహెచ్ సత్తిబాబు పర్యావరణహిత జీవనశైలి ప్రతిజ్ఞ చేశారు. జిల్లా అటవీశాఖ అధికారి ఎం.వి.ప్రసాదరావు, డీఆర్‌డీఏ పీడీ శివశంకర్‌ప్రసాద్, డ్వామా పీడీ మధుసూదనరావు, వ్యవసాయశాఖ జిల్లా అధికారి కె.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అన్నదాతకు పరపతి

- రైతుకు వ్యక్తిగత వ్యవసాయ రుణాలు
- కోనసీమ జిల్లాలో ప్రయోగాత్మకంగా అమలు
- లోన్స్ ఫర్ అగ్రికల్చర్ ప్రొఫెషనల్స్ పేరు మీద అప్పులు
- కౌలుదారులకు ప్రయోజనం
- ఖరీఫ్ నుంచి శ్రీకారం
- తొలిదశలో పది మండలాల పరిధిలో పది గ్రామాల ఎంపిక



కౌలురైతులు (ఫైల్)

సాక్షి అమలాపురం : కౌలు రైతులను రాష్ట్ర ప్రభుత్వం అగ్రికల్చర్ ప్రొఫెషనల్స్ (వ్యవసాయ నిపుణులు)గా గుర్తించింది. ఇప్పటివరకు ఉద్యోగులకు.. వ్యాపారులకు మాత్రమే అందుబాటులో ఉన్న వ్యక్తిగత రుణాలు (పర్సనల్ లోన్స్) ఇక నుంచి రైతులకు సైతం అందజేయనున్నారు. ఈ బృహత్తర కార్యక్రమానికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా యంత్రాంగం శ్రీకారం చుట్టింది. ఈ ఖరీఫ్ నుంచి జిల్లాలో దీనిని ప్రయోగాత్మకంగా (పైలట్ ప్రాజెక్టు) అమలు చేయనున్నారు. కౌలుదారులకు పంట సాగుదారుల హక్కు పత్రం (సీసీఆర్‌సీ కార్డు) లేకున్నా అగ్రికల్చర్ ప్రొఫెషనల్స్ గుర్తింపు ద్వారా సాగు విస్తీర్ణాన్ని బట్టి రూ.లక్ష వరకు రుణం ఇవ్వనున్నారు. సీసీఆర్‌సీ కార్డుల ద్వారా కౌలుదారులు బ్యాంకుల నుంచి పంట రుణాలు పొందే అవకాశముంది. అయితే, భూమి యజమానులు కౌలుదారులకు భూములు సాగుకు ఇస్తున్నా.. ఈ కార్డులు వచ్చేందుకు సంతకాలు చేయడం లేదు. కొంతమందికి సీసీఆర్‌సీ కార్డులున్నా రుణాలు పొందలేకపోతున్నారు. తక్కువమందికి మాత్రమే రుణాలు రావడం వెనుక భూ యజమానులు ఆ సర్వే నంబరు మీద అప్పటికే రుణం తీసుకుని ఉండడమే కారణం. రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా నిబంధనలు అనుసరించి ఒకే సర్వే నెంబరు మీద ఇద్దరికి రుణం ఇచ్చే అవకాశంలేదు. పైగా కౌలుదారులు రుణం పొందేందుకు భూ యజమాని నుంచి ఎన్‌ఓసీ పొందేందుకు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈ కారణంగానే కోనసీమ జిల్లాలో 55 వేలు మందికి సీసీఆర్‌సీ కార్డులుంటే గత ఏడాది కేవలం 13 వేల మందికి మాత్రమే పంట రుణాలందాయి.

కౌలుదారులకు పర్సనల్ లోన్స్..

క్షేత్రస్థాయిలో రుణాలు అందక ఇబ్బంది పడుతున్న కౌలుదారుల దుస్థితి చూసిన జిల్లా యంత్రాంగం వారికి వ్యక్తిగత రుణాలు ఇవ్వాలని సంకల్పించింది. జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా చొరవ తీసుకుని లోన్ ఫర్ అగ్రికల్చర్ ప్రొఫెషనల్స్ పేరుతో బ్యాంకుల ద్వారా వ్యక్తిగత రుణాలు ఇప్పించాలని నిర్ణయించారు. జిల్లాలో తొలి విడతగా పది మండలాలను ఎంపిక చేశారు. మలికిపురం, రాజోలు, మామిడికుదురు, పి.గన్నవరం, అంబాజీపేట, అల్లవరం, అయినవిల్లి, ముమ్మిడివరం, కొత్తపేట, రావులపాలెం మండలాల్లో ఒక్కో గ్రామాన్ని ఎంపికచేసి తొలి విడతగా రుణాలు ఇవ్వనున్నారు. రైతు సాగుచేసే పంట, భూమి విస్తీర్ణాన్ని బట్టి రూ.లక్ష వరకు రుణం అందించనున్నారు. ఈ పైలట్ ప్రాజెక్టులో భాగస్వామిగా ఉన్న జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) ఈ రుణాలు ఇవ్వనుంది. ఇలా చేయడం ద్వారా తాము ప్రైవేట్ వ్యక్తుల వద్ద నుంచి అధిక వడ్డీలకు అప్పులు చేయాల్సిన దుస్థితి తప్పుతుందని కౌలుదారులు చెబుతున్నారు. రుణాన్ని 11 నెలల కాల వ్యవధిలో చెల్లించాలి. ఎంపిక చేసిన రైతులకు జులై 15వ తేదీ నుంచి రుణం అందించనున్నారు. జిల్లావ్యాప్తంగా తొలి దశలో సుమారు వేయి మందికి రుణాలు అందించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

ప్రత్యేక యాప్ రూపకల్పన

పైలట్ ప్రాజెక్టులో ఉన్న గ్రామాల్లోని రైతుల సమగ్ర సమాచారాన్ని వ్యవసాయ శాఖాధికారులు సేకరించారు. ఇందుకు ప్రత్యేకంగా యాప్‌ను రూపొందించే పనిలో ఉన్నారు. రైతుకు సంబంధించిన మొత్తం సమాచారాన్ని దీనిలో పొందు పరచనున్నారు. రుణం పొందే వ్యక్తులు ఐదేళ్లు అదే గ్రామంలో నివాసం ఉండడంతోపాటు కౌలుదారునిగా పంట సాగుచేస్తూ ఉండాలి. వీఏఏ, వీఆర్వోల సిఫార్సు మేరకు వీరికి డీసీసీబీ రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు రుణం ఇస్తుంది. రైతులకు ఈ పర్సనల్ లోన్ పైలట్ ప్రాజెక్టు విజయవంతమైతే జిల్లాలోని మిగిలిన గ్రామాలకు విస్తరించాలని అధికార యంత్రాంగం భావిస్తోంది. ఇటీవల జిల్లా పర్యటనకు వచ్చిన ఏపీ స్టేట్ అగ్రికల్చర్ మిషన్ వైస్ చైర్మన్ ఎంవీఎస్ నాగిరెడ్డి ఈ విధానాన్ని ప్రశంసించారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేసేలా కృషి చేస్తానన్నారు.

తొలిదశలో పది మండలాల్లో..



కౌలుదారులకు సులువుగా రుణం అందేలా వారిని అగ్రికల్చర్ ప్రొఫెషనల్స్‌గా గుర్తించనున్నాం. తొలిదశలో డీసీసీబీ ద్వారా పది మండలాల్లోని పది గ్రామాలను ఎంపిక చేశాం. రైతుల సమగ్ర సమాచారం సేకరించి వివరాలను ప్రత్యేక యాప్‌లో పొందుపరుస్తాం.

– హిమాన్షు శుక్లా, కలెక్టర్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

పశ్చాత్తాప తీర్మానం పెట్టే దమ్ముందా బాబూ..!

- పుష్కరాల్లో 29 మంది మృతికి కారణం మీరు కాదా?
- చంద్రబాబుపై మంత్రి వేణు ఫైర్

సాక్షి, రాజమహేంద్రవరం: గోదావరి పుష్కరాల్లో 29 మందిని పొట్టనబెట్టుకున్న చంద్రబాబు నేటికీ వారి కుటుంబాలను పరామర్శించిన దాఖలాలు లేవు. దుర్ఘటన జరిగి ఏళ్లు గడుస్తున్నా కుటుంబాలపై మానవత్వం చూపని ఆయన ఏ ముఖం పెట్టుకుని రాజమహేంద్రవరంలో మహానాడు పెడుతున్నారని మంత్రి చెల్లుబోయిన వేణు ప్రశ్నించారు. మహానాడులో పశ్చాత్తాప తీర్మానం పెట్టాలని డిమాండ్ చేశారు. రాజమహేంద్రవరంలో ప్రెస్‌క్లబ్‌లో గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి పార్టీని, అధికారాన్ని లాక్కున్నావు. ఈనాడులో తప్పుడు కథనాలు రాయించి ఆయన ఆత్మక్షోభకు గురయ్యేలా చేయలేదా? అని మండిపడ్డారు. భారతరత్న ఇవ్వాలని పైకి కోరుతూ లోలోపల మాత్రం రాకుండా అడ్డుపడుతున్నది మీరు కాదా? అని ప్రశ్నించారు. రాజకీయ, పదవీ భిక్ష పెట్టిన ఎన్టీఆర్‌కు అన్యాయం చేశారన్నారు.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృష్ణా జిల్లాకు ఎన్టీఆర్ పేరు పెట్టి ఆయన పేరును చిరస్థాయిగా నిలిచేలా చేశారన్నారు. బాబు సీఎం ఉన్నప్పుడు చేయలేని పని జగన్ చేశారన్నారు. అందుకు మహానాడులో సీఎంకు ధన్యవాదాలు చెప్పే తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. అమరావతిలో నిరుపేదలకు ఇంటి స్థలాలు ఇస్తుంటే వాటిపై బురదజల్లే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. అక్కడ ఎస్సీలు ఉండకూడదా? అని దుయ్యబట్టారు. స్థలాలు ఇవ్వకూడదని చెప్పి తప్పు చేశానని మహానాడులో తీర్మానం చేసే దమ్ముందా? అని చంద్రబాబును ప్రశ్నించారు.

క్లుప్తంగా

గోదావరిలో స్నానానికి వెళ్లిన యువకుడి మృతి


వీరాస్వామి మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లి నాగమణి

నిడదవోలు రూరల్ / ఆత్రేయపురం : మండలంలోని తాడిమళ్ల గ్రామానికి చెందిన బి.వీరస్వామి (22) డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం బొబ్బర్లంక వద్ద గోదావరిలో స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తూ నీటమునిగి మృతి చెందడంతో స్వగ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. ధాన్యం డబ్బు తీసేందుకు బ్యాంకుకు నిడదవోలు వెళ్లిన వీరస్వామి స్నేహితులతో కలిసి గురువారం మధ్యాహ్నం గోదావరిలో స్నానానికి వెళ్లి మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. చేతికి అందివచ్చిన ఒక్కగానొక్క కొడుకు మృతిచెందడంతో తల్లిదండ్రులు నాగమణి,వెంకటేశ్వరరావు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. వీరస్వామి కూలీపనులతో పాటు చేపల వేటకు వెళ్తాడు. మృతుడికి సోదరి ఉండగా ఆమెకు వివాహమైంది.

పేకాట స్థావరంపై దాడి

అమలాపురం టౌన్: అమలాపురం హౌసింగ్ బోర్డు కాలనీలోని ఓ ఇంట్లో పేకాట ఆడుతున్న బృందంపై పట్టణ పోలీసులు బుధవారం రాత్రి మెరుపు దాడి చేశారు. వారి నుంచి రూ.1.13 లక్షల నగ దు స్వాధీనం చేసుకున్నట్లు దాడి నిర్వహించిన పట్టణ ఎస్సై ప్రభాకర్ తెలిపారు. మొత్తం 12 మంది పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసినట్లు చెప్పారు. నగదుతోపాటు పేకాటకు ఉపయోగించే కాయన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

వడిబడిగా మెరుగులు

- వేగంగా నాడు–నేడు రెండో దశ పనులు
- 772 పాఠశాలలకు రూ.257 కోట్లు మంజూరు
- రెండు విడతల్లో రూ.75 కోట్లు విడుదల

రాయవరం: విద్యార్థుల ఉన్నత భవిష్యత్తే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోట్లాది రూపాయలతో పాఠశాలల రూపురేఖలను మార్చారు. కార్పొరేట్ పాఠశాలలకు ఏ మాత్రం తీసిపోని విధంగా మౌలిక సదుపాయాలపై దృష్టి సారించారు. మనబడి నాడు–నేడు మొదటి దశ పనులు దిగ్విజయంగా పూర్తి కాగా, రెండో దశలో మిగిలిన పాఠశాలలను ఆధునికీకరిస్తున్నారు. పాఠశాలల పునఃప్రారంభం నాటికి పనులు పూర్తి చేసేందుకు వేగవంతం చేస్తున్నారు.

విద్యాయజ్ఞం..నిరంతరాయం

రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి విద్యాయజ్ఞాన్ని విజయవంతంగా కొనసాగిస్తోంది. మనబడి నాడు–నేడు ద్వారా పాఠశాలల రూపురేఖలను మార్చివేసింది. మొదటి విడతలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 1,134 పాఠశాలలను అభివృద్ధి చేశారు. రెండో విడతలో మిగిలిన పాఠశాలలన్నింటినీ ఆధునికీకరణ బాట పట్టించేందుకు వేసిన ప్రణాళికలు సత్ఫలితాలనిస్తున్నాయి. జిల్లాల పునర్విభజన అనంతరం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోనే నాడు–నేడు రెండో విడతలో 772 పాఠశాలలను ఎంపిక చేశారు. ఇందులో 11 ప్రభుత్వ జూనియర్ కళాశాలలతో సహా, 761 పాఠశాలల్లో ఆధునికీకరణ పనులు చేపట్టారు. రూ.257 కోట్ల అంచనాతో పనులు చేపట్టారు. పాఠశాలల భౌతిక స్వరూపాన్ని మార్చడంతో పాటుగా విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేస్తున్నారు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అవసరమైన అదనపు తరగతి గదులు, టాయిలెట్స్, ఫర్నీచర్, విద్యుద్దీకరణ, తాగునీరు తదితర వసతులను కల్పిస్తున్నారు.

తాజాగా రూ.37 కోట్లు విడుదల

కోనసీమ జిల్లాలో 772 పాఠశాలలకు రూ.257 కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం ఇప్పటి వరకు రూ.75 కోట్లు విడుదల చేసింది. మొదటి విడతగా రూ.38 కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం, తాజాగా రెండవ విడతలో రూ.37 కోట్లు పాఠశాలల ఖాతాలకు జమ చేసింది. పాఠశాలల్లో జరుగుతున్న పనుల పురోగతికి అనుగుణంగా నిధులు మంజూరు చేస్తున్న ప్రభుత్వం వచ్చే విద్యా సంవత్సరంలో పాఠశాలల పునఃప్రారంభానికి ముందుగానే పనులన్నింటినీ పూర్తి చేసే విధంగా విద్యాశాఖాధికారులకు లక్ష్యాన్ని విధించింది. పనుల పురోగతిని ఎప్పటికప్పుడు తెలియజేసే ఫొటోలను ఇంజినీరింగ్ అసిస్టెంట్స్ యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. పనుల పురోగతిపై రాష్ట్ర స్థాయి అధికారులు ఎప్పటికప్పుడు జిల్లా అధికారులతో సమీక్ష చేస్తున్నారు. జిల్లా అధికారులు మండల స్థాయి అధికారులతో సమీక్ష చేస్తూ రెండవ దశ పనులను వేగవంతం చేస్తున్నారు.

పాఠశాలలకు చేరుకుంటున్న నూతన ఫర్నీచర్

నాడు–నేడు రెండో విడతలో ఎంపికైన పాఠశాలలకు కొత్తగా కొనుగోలు చేసిన ఫర్నీచర్‌ను ప్రభుత్వం నేరుగా ఆయా పాఠశాలలకు పంపిణీ చేస్తోంది.


నాడు–నేడు రెండో దశ పనులు

జిల్లాలోని 22 మండలాల్లోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు డ్యూయల్ డెస్క్‌లు, ఉపాధ్యాయులు కూర్చునేందుకు అవసరమైన కుర్చీలు, టేబుల్స్, ఫ్యాన్లు, లైట్లు తదితర సామగ్రిని నేరుగా పాఠశాలలకు తరలిస్తున్నారు. ఏళ్ల తరబడి ఎటువంటి మౌలిక వసతులు, ఫర్నీచర్‌ను చూడని పరిస్థితుల్లో ప్రస్తుతం లక్షలాది రూపాయలు వెచ్చించి పాఠశాలలకు బ్రాండెడ్ ఫర్నీచర్‌ను సమకూర్చడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నిరంతర పర్యవేక్షణ



మనబడి నాడు–నేడు రెండో దశ పనుల ప్రగతిని నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నాం. ప్రతి వారం సమీక్ష చేస్తూ, పనుల వేగవంతానికి అవసరమైన చర్యలు చేపడుతున్నాం.

– ఎం.కమలకుమారి, డీఈవో, అమలాపురం.

వంట గ్యాస్ లీకై అగ్ని ప్రమాదం

రూ. తొమ్మిది లక్షల ఆస్తినష్టం

మండపేట: సిలిండర్ మారుస్తున్న సమయంలో ఒక్కసారిగా గ్యాస్ లీకై అగ్నిప్రమాదం చోటుచేసుకున్న ఘటన గురువారం మండలంలోని ఏడిదలో చోటుచేసుకుంది. గ్రామంలోని జమ్మిచెట్టు వీధిలోని జీ ప్లస్ 2 ఇంటిలో కామన కృష్ణ కుటుంబం మొదటి అంతస్తులో నివసిస్తున్నారు. ఉదయం గ్యాస్ సిలిండర్ మారుస్తున్న సమయంలో రెగ్యులేటర్ నుంచి ఒక్కసారిగా గ్యాస్‌లీకై మంటలు చెలరేగాయి. దీంతో ఇంట్లోని వారు భయంతో బయటకు పరుగులు తీశారు. మంటలు వ్యాపించి ఇంట్లోని గృహోపకరణాలు దగ్ధమయ్యాయి. గ్యాస్ తాకిడికి గుమ్మాలు, కిటికీలు ధ్వంసమయ్యాయి. సీలింగ్, వైరింగ్ మొత్తం కాలిపోయాయి. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు మండపేట ఫైర్‌స్టేషన్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాద ఘటనతో చుట్టుపక్కల వారు ఆందోళనకు గురయ్యారు. ఈ ఘటనలో రూ. తొమ్మిది లక్షల ఆస్తినష్టం వాటిల్లినట్టు ఫైర్ స్టేషన్ సిబ్బంది తెలిపారు. అదృష్టవశాత్తూ ఎవరికీ ఏమీ కాలేదు. కాగా నూతనంగా నిర్మించిన ఈ ఇంటిలోకి ఇటీవలే గృహప్రవేశం చేసినట్టు స్థానికులు తెలిపారు. ఈ ప్రమాదంతో ఆ కుటుంబం తీవ్ర బాధలో మునిగిపోయింది. గ్రామ సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం, సొసైటీ చైర్మన్ రామిశెట్టి శ్రీహరిబాబు తదితరులు ఘటనా స్థలానికి చేరుకుని బాధిత కుటుంబాన్ని ఓదార్చారు.


అగ్నికి ఆహుతైన బీరువా, కిచెన్‌లోని సామగ్రి


కాలిపోయిన గృహోపకరణాలు

మృత్యువులోనూ ఒకరికొకరు

- భార్య అంత్యక్రియలు పూర్తి చేసి వచ్చిన వెంటనే భర్త మృతి
- సంధిపూడిలో తీవ్ర విషాద ఛాయలు

ఆలమూరు: ఐదు దశాబ్దాల పాటు అన్యోన్య దాంపత్యం గడిపిన ఆ ఆలుమగలను మృత్యువులో సైతం విడదీయలేకపోయింది. పది గంటల వ్యవధిలో భార్యాభర్తలిద్దరూ మృతిచెందిన హృదయ విదారకర సంఘటన ఆలమూరు మండలంలోని సంధిపూడిలో జరిగింది. ఇతరులకు స్ఫూర్తినిచ్చే ఆదర్శ జీవితం గడుపుతున్న తమ జంటను మృత్యువు కూడా విడదీయలేదని ఆ గ్రామానికి చెందిన దంపతులు తోరాటి చక్రవేణి (64), తోరాటి చిన కాపు (69) నిరూపించారు. వివరాలలోకి వెళితే స్థానిక మెయిన్‌రోడ్డు పక్కన ఇంట్లో భార్యా భర్తలిద్దరూ నివాసం ఉంటున్నారు. ఆ దంపతులకు ఉన్న నలుగురు కుమారుల్లో ముగ్గురికి వివాహాలు జరగ్గా చిన్న కుమారుడు తల్లిదండ్రుల చెంతనే ఉంటున్నాడు. భార్య చక్రవేణి ఐదేళ్ల నుంచి అనారోగ్యంతో మంచానికే పరిమితమయ్యారు. అప్పటిన ఉంచి భర్త చినకాపు సపర్యలు చేస్తూ వెన్నంటి ఉన్నారు. భార్య చక్రవేణి ఆరోగ్యం మరింత క్షీణించడంతో బుధవారం అర్ధరాత్రి 12 గంటల ప్రాంతంలో మృతి చెందారు. ఆమె మృతదేహాన్ని అశ్రునయనాల మధ్య స్థానిక శ్మశాన వాటికకు తీసుకెళ్లి అంత్యక్రియలు చేసి ఇంటికి వచ్చారు. తన అర్ధాంగి మృతిని జీర్ణించుకోలేని భర్త చినకాపు కొద్ది నిమిషాల వ్యవధిలో గురువారం హఠాత్తుగా కుప్పకూలి మృతి చెందారు. బంధుమిత్రులు మళ్లీ శ్మశాన వాటికకు వెళ్లి శోకతప్త హృదయాలతో అంత్యక్రియలు నిర్వహించవలసిన పరిస్థితి ఆ కుటుంబానికి ఏర్పడింది. భార్యాభర్తలు ఒకరు తరువాత ఒకరు తనువు చాలించడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఇలాంటి అరుదైన ఘటనే ఈ గ్రామంలోనే 2018 మార్చి 18న జరిగింది. ఆ ఘటన మరువకముందే భార్యాభర్తలు మృతి చెందడంతో విషయం తెలుసుకున్న అనేక మంది చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.



ఆలమూరు మండలం సంధిపూడిలో మృతిచెందిన దంపతులు (పాత చిత్రాలు)

సూర పొగాకు కొనుగోళ్లు ఆశాజనకం

గోపాలపురం: సూర పొగాకు కొనుగోళ్లు ఆశాజనకంగా ఉన్నాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గురువారం నుంచి అయిదు రోజుల పాటు జరిగే సూర పొగాకు కొనుగోళ్లకు సరాసరి ధర రూ.160లు ఇవ్వాలని రైతు సంఘం ప్రతినిధులు కంపెనీ ప్రతినిధులను కోరారు. కనిష్ఠ ధర రూ.140 కాగా గరిష్ఠ ధర రూ.168 పలికింది. సరాసరి ధర రూ.155 ఉండటంతో మారో అయిదు రూపాయలు పెంచాలంటూ రైతులు కోరారు. గత ఏడాదితో పోల్చుకుంటే ఈ సంవత్సరం పొగాకు కొనుగోళ్లు ఆశాజనకంగా ఉన్నట్లు రైతు సంఘం నాయకులు పిన్నమనేని మధుమోహన్, ఇల్లూరి పెంటరాజు, గద్దే శేషగిరిరావు, ఇల్లూరి రాంబాబు పేర్కొన్నారు. ధరల పెంపుపై వేలం నిర్వాహణాధికారి ఎస్ఎస్ శ్యామ్ రైతులకు వివరించారు.


గోపాలపురం పొగాకు వేలం కేంద్రంలో సాగుతున్న సూర పొగాకు కొనుగోళ్లు

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

రంగంపేట: మండలంలోని వడిశలేరు వద్ద గురువారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం పాలయ్యాడు. ఈ ప్రమాదంపై స్థానిక ఎస్సై టి.రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం కాకినాడ అచ్చంపేట జంక్షన్ పెనుమర్తికి చెందిన అనపర్తి సూర్య కార్తిక్(22), అతని సోదరి రమ్యశ్రీ ఏడీబీ రోడ్డులో రాజమహేంద్రవరం వైపు నుంచి కాకినాడ బైక్ పై వెళుతున్నారు. వడిశలేరు సమీపంలోని కార్గిల్ ఫ్యాక్టరీ వద్దకు వచ్చే సరికి ఎదురుగా వస్తున్న బోర్‌వెల్ లారీ ఢీ కొట్టడంతో బైక్ నడుపుతున్న సూర్య కార్తిక్ తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు., వెనుక కూర్చున్న రమ్యశ్రీకి తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను పెద్దాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై చెప్పారు.


సూర్య కార్తిక్ మృతదేహం

టీఎస్ ఎంసెట్‌లో తిరుమల జయకేతనం

రాజమహేంద్రవరం రూరల్: తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన ఎంసెట్ అగ్రికల్చర్ అండ్ మెడికల్ ఫలితాలలో రాజమహేంద్రవరంలోని తమ తిరుమల ఐఐటీ అండ్ మెడికల్ అకాడమీ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారని తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. రాష్ట్రస్థాయిలో బీఎస్ఆర్ జశ్వంత్ ప్రథమ ర్యాంకును, కె.సుహాంత్ 41, కేజీఎం శంకర్ అజయ్ 52, ఎస్‌హెచ్‌డీ అనిరుథ్ 90, వై.గణేష్‌తేజ 180, పీఎస్ఎస్ గోపినాథ్ 182, ఎం.గంగాతల్లి 184, కేవీఎన్ ప్రశాంతి 263, ఎం.శృతి 266, టీపీఎల్ సత్య 276, ఎం.అమృత 278, కేవీఎల్ సాయిశ్రీ 313, సీహెచ్ఎస్‌కే శ్రీనివాసిని 327, జీఎస్ చందన 421, డీపీఎస్ఎస్ రిష్మిత 425, పి.తనూశ్రీ 436, బీఎన్ సిద్ధేష్ 444, పి.లిఖితరాణి 460వ ర్యాంకును సాధించారని తెలిపారు. 100లోపు నాలుగు ర్యాంకులు, 500లలోపు 18, 1000లోపు 32 ర్యాంకులు సాధించారని చెప్పారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను నున్న తిరుమలరావు, అకడమిక్ డైరెక్టర్ జి.సతీష్‌బాబు, ప్రిన్సిపాల్ వి.శ్రీహరి అభినందించారు.


ర్యాంకులు సాధించిన విద్యార్థులతో తిరుమల విద్యాసంస్థల చైర్మన్ తిరుమలరావు

దిగొచ్చిన మంచినూనె


ఆయిల్ హోల్‌సేల్ దుకాణం

- పామాయిల్ లీటర్ రూ.140 నుంచి రూ.99
- సన్ ఫ్లవర్ రూ.180 నుంచి రూ.120
- రైస్‌బ్రాన్ రూ.140 నుంచి రూ.110

రంగంపేట: మొన్నటి వరకు ఆకాశన్నంటిన వంట నూనెల ధరలు ఇప్పుడు దిగొస్తున్నాయి. ఆరు నెలల క్రితం రూ.200 వరకు పలికిన లీటర్ నూనె ధర ప్రస్తుతం రూ.120 దిగువకు చేరింది. వంట నూనెల్లో సన్ ఫ్లవర్, పామాయిల్, రైస్ బ్రాన్ ఆయిల్ ధరలు బాగా తగ్గడంతో సామాన్యులకు భారీ ఊరట లభిస్తోంది.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చర్యలతో తగ్గుముఖం

ఒకప్పుడు ఏ ఆయిల్ తీసుకున్న లీటర్ నూనె రూ.100 లోపే ఉండేది. అయితే కరోనా సమయంలో వంట నూనెల ధరలు బాగా పెరిగాయి. ఆ సమయంలో పామాయిల్ ధరలు లీటర్ రూ.170కి చేరుకున్నాయి. సన్ ఫ్లవర్, రైస్‌బ్రాన్ ఆయిల్ లీటర్ నూనె ధరలు రూ.180కి చేరువయ్యాయి. ఇంతలోనే రష్యా, ఉక్రెయిన్ దేశాల మధ్య యుద్ధం మొదలు కావడంతో వంట నూనెల ధరలు ఆకాశన్నంటాయి. ఒక దశలో లీటర్ రూ.200 మార్క్‌ను దాటింది. ఆ సమయంలో పేదలకు వంట నూనె కొనుగోలు తీవ్ర భారంగా మారింది. పెరుగుతున్న ధరలతో సామాన్య ప్రజలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకున్న కేంద్ర ప్రభుత్వం స్టాంప్ డ్యూటీని గతేడాది ఒకసారి, ఈ ఏడాది ఇటీవలే మరోసారి తగ్గించింది. దీనికితోడు అంతర్జాతీయంగా నూనెల ధరలు తగ్గడం మొదలు కావడంతో దేశంలో ధరలు అదుపులోకి వచ్చాయి. ఇదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వం ఆయిల్ రేట్లు పెరగకుండా తరచూ మిల్లుల్లో తనిఖీలు చేయడం, కల్తీలు లేకుండా చర్యలు తీసుకోవడంతో నూనెల ధరలు బాగా తగ్గిపోయాయి. ప్రస్తుతం



పామాయిల్ లీటర్ ధర రూ.99 కాగా, సన్ ఫ్లవర్ రూ. 120, రైస్‌బ్రాన్ ఆయిల్ రూ.110గా ఉన్నాయి.

లీటర్‌కు రూ.70 వరకు తగ్గుదల



ఆరు నెలల నుంచి రేట్లు తగ్గుతూ వస్తున్నాయి. ప్రస్తుతం లీటర్ పామాయిల్ ధర రూ.99గా ఉంది. ఆరు నెలలతో పోల్చుకుంటే లీటర్‌కు రూ.70 వరకు తగ్గగా, డబ్బా (15 లీటర్ల)కు రూ.350 వరకు తగ్గింది.

– యాగా ప్రసాద్, వ్యాపారి, రంగంపేట

సంతోషకరం



ఏ ఆయిల్ కొనాలన్నా రూ.200కు పైనే రేటు ఉండేది. నిత్యవసరాల ధరల్లో వంట నూనెకే ఎక్కువ ఖర్చు చేయాల్సి వచ్చేది. ప్రస్తుతం వేరుశనగ మినహా అన్ని రకాల వంట నూనెల ధరలు తగ్గాయి.

– కేసిమిల్లి రవణమ్మ, గృహిణి, రంగంపేట

శ్రీబాల బాలాజీని దర్శించుకున్న సీనియర్ సివిల్ జడ్జి దంపతులు

మామిడికుదురు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం అప్పనపల్లి గ్రామంలో వేంచేసిన శ్రీబాల బాలాజీ స్వామివారిని హైదరాబాద్ సీనియర్ సివిల్ జడ్జి భవానీ దంపతులు గురువారం దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా భవాని దంపతులకు ఆలయ సిబ్బంది స్వాగతం పలికారు. అర్చకులు, ఆలయ సిబ్బంది భవాని దంపతులను సత్కరించి, స్వామివారి ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అసిస్టెంట్ కమిషనర్, ఈఓ దాసరి రామప్రసాదరావు పాల్గొన్నారు.


స్వామివారి సన్నిధిలో సీనియర్ సివిల్ జడ్జి భవాని దంపతులు

మాల్ ప్రాక్టీస్‌కు యత్నించిన ముగ్గురి అరెస్ట్

మండపేట: ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల్లో మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడేందుకు యత్నించిన ఆరుగురిపై పట్టణ పోలీసులు గురువారం రాత్రి కేసు నమోదు చేశారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ఇంగ్లిషు పరీక్ష జరిగింది. పట్టణంలోని ప్రైవేట్ కళాశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులకు బదులుగా టి.హేమంత్, సీహెచ్ జయవర్ధన్, వి.ఆశాలత, మరో ముగ్గురు పరీక్ష రాసేందుకు ప్రయత్నించారు. జూనియర్ కళాశాల సెంటర్ చీఫ్ సూపరింటెండెంట్ ఎస్ఎస్‌బీవీఎస్ఎస్ సుబ్బారావు వీరిని గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేసి, అనంతరం స్టేషన్ బెయిల్‌పై విడుదల చేశారు. ఇతర జిల్లాలకు చెందిన ముగ్గురి వివరాలు తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

లారీ క్యాబిన్‌కు ఉరేసుకుని డ్రైవర్ ఆత్మహత్య

రావులపాలెం: లారీ క్యాబిన్ పై భాగానికి తాడు కట్టుకుని లారీ డ్రైవర్ ఉరి వేసుకున్న ఘటన గురువారం తెల్లవారు జామున రావులపాలెం జాతీయ రహదారిపై ఈతకోట టోల్‌ప్లాజా సమీపంలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం టోల్‌ప్లాజాకు సమీపంలో ఎడమవైపు రోడ్డులో జాతీయ రహదారి పక్కన ఆగి ఉన్న లారీకి డ్రైవర్ ఉరివేసుకుని వేలాడుతుండటం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఎస్సై ఎం.వెంకటరమణ ఘటనా స్థలికి చేరుకుని పరిశీలించారు. ఏలూరు జిల్లా భీమడోలు మండలం అంబరుపేటకు చెందిన లారీడ్రైవర్ కట్టా ప్రసాద్(30) బుధవారం ఉదయం భీమడోలు నుంచి కూల్‌డ్రింక్ లోడు తీసుకుని కోనసీమ జిల్లా కాట్రేనికోనలో దించడానికి బయలుదేరాడు. రాత్రి లోడు దించేసి తిరుగు ప్రయాణంలో ఈతకోట టోల్‌ప్లాజా సమీపానికి చేరుకున్నాడు. అక్కడే లారీని పక్కకు ఆపి లారీలోఉన్న తాడుతో క్యాబిన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆర్థిక ఇబ్బందులతోనే డ్రైవర్ ప్రసాద్ ఉరివేసుకున్నట్టు బంధువులు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కొత్తపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి తల్లి, భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నట్టు ఎస్సై తెలిపారు.


మృతుడు ప్రసాద్ (ఫైల్)